

# భవానీద్వీపం

-వనం వేంకట వరప్రసాదరావు



**నాలుగువందల సంవత్సరాల కాలపరిధిలో సామాజిక, చారిత్రక వాస్తవాలను, సాహిత్య, ఆధ్యాత్మిక, యోగశాస్త్ర, మంత్ర శాస్త్ర రహస్యాలను కలుపుతూ సాగిన గాథ. చరిత్ర నిర్ధారించిన సత్యాలు, చరిత్రకు అందని రహస్యాలు, చారిత్రక పురుషుల సాహసాలు, కలగలిపి సమన్వయము చేసిన గాథ. తెలియని కొన్ని వాస్తవాలను తెలియజేస్తూ, తెలుసును అనుకుంటున్న కొన్ని 'అపోహలను' దూరం చేస్తూ సాగే కల్పిత సాహసిక గాథ. స్వతంత్ర సమరరంగముతో మొదలుకొని యుద్ధ, జానపద క్రీడల మర్మాలు, సాధకుల గాథలు, త్యాగధనుల చారిత్రక గాథలు కలిసిపోయిన కాల్పనిక గాథ. ఇలానే జరిగింది అని తెలిసిన సత్యాలకు యిలా కూడా జరిగి ఉండవచ్చు అన్న చారిత్రక పరిశీలనను జోడించి, వాస్తవ దూరం కాని ఊహలతో సాగిన పరిశీలనాత్మకమైన కథ. ఒక సాహసిక యోధుడి కథతో మొదలై క్రీ.శ. 1677 నుండి ఆధునిక కాలంవరకూ తరతరాల అంతరాలను, అంతరంగాలను విభిన్న కోణాలనుండి విమర్శించిన గాథ. కొందరికి తెలిసిన కొన్నిటిని, అందరికీ తెలియాల్సిన ఎన్నిటితోనో సమన్వయము చేస్తూ సాగిన వాస్తవ గాథల, చారిత్రక సత్యాల సమ్మేళనమైన కాల్పనిక గాథ!**

## - 12 -

(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

ఆనందంగా ఒకరినొకరు చూసుకున్నారు అన్నదమ్ములు. ధన్యవాదసూచనగా మరొకసారి నమస్కరించారు. సమర్థరాముని చూపులు ద్వారబంధం బయటికి ప్రసరిస్తున్నాయి, పరిశీలనగా. ఒక చిరుకదలిక ఆయనదృష్టిని తప్పించుకోలేకపోయింది. తన ప్రధాన శిష్యునివైపు చూసి కంటితోనే ఏదో ఆజ్ఞ యిచ్చినట్లున్నాడు. చటుక్కున కదిలి లోగొంతుకతో ఏదో చెప్పి, అక్కన్న మాదన్నల అంగరక్షకులను దూరంగా, మామిడి తోటలోకితీసుకునివెళ్లి, చెట్ల క్రింద కూర్చోనబెట్టిన సడి వినిపించింది.

'మాధోబా! జాగరూకులై, రక్షితులై ఉండండి. జయజయ రఘువీర సమర్థ!' మంద్రస్వరంతో పలికారు సమర్థ రాముడు. మాదన్న ఏదో అనబోతుండగా, ప్రధాన శిష్యుడు లోనికి వచ్చాడు. 'ఎవరో అతిథి వచ్చినట్లున్నారు, మీ సమాచారాన్ని అడుగుతున్నారు' అన్నాడు మాదన్నతో, మరాఠీలో.

ప్రశ్నార్థకంగా, సంశయంగా చూస్తూ 'కూర్చుండబెట్టండి, వస్తాను' అన్నాడు మాదన్న. చిరునవ్వుతో 'రావలసినవాడే సమయానికే వచ్చాడు, లోనికి పంపు' అన్నాడు సమర్థరాముడు. శిష్యుడు బయటకు వెళ్ళాడు. కృష్ణరాయలకు, అన్నదమ్ములకు కలిగిన కుతూహలం వారి కనులలో దాగలేకపోయింది.

రెండునిముషాల అనంతరం శిష్యుని వెనుకగా లోనకు వచ్చాడొక నడివయసు వ్యక్తి. షుమారు యాభై సంవత్సరాల వయసు ఉండవచ్చు. నలిగిన నల్లకలువలాగా ఉన్నాడు. చిరిగిన చెంగున అటుకులను మూటగట్టి తెచ్చిన కుచేలుడిలా ఉన్నాడు. శ్యామవర్ణం ఎంత అందంగా ఉంటుందో ఆతడిని చూస్తే మరొకసారి తెలుస్తున్నది. స్వాప్నికలోకంలోకి చూస్తున్నట్లు నల్లని తళుకులీనుతున్న లోతైన పెద్దకనులు. పొడవైన సన్నని నాసిక, అందమైన చుబుకం. కేశసంస్కారం లేనట్లు, మాసిన గడ్డంతో ఉన్నా అదొక వింత అందం ఉన్నది ఆముఖంలో. బక్కపలచగా, దృఢంగా, ఉన్నాడు. నిదానంగా లోనకు రావడంతోనే చుట్టూ కలయజూశాడు. సమర్థ రామునికి నమస్కరించి ఒక లిప్తమాత్రం ఆయన ముఖంమీదనే దృష్టి నిలిపి రెండుచేతులూ బంధించి, కుడిఎడమలుగా చెవులను చూపుదు, మధ్యవ్రేళ్ళ మధ్యన పట్టుకుని ' చతుస్సాగరపర్యంతం గో బ్రాహ్మణేభ్యః శుభంభవతు.. .. అహం భో అభివాదయే'. ఆ ప్రవర ముగియడంతోనే, పరిచయం అవగానే, కనులకు స్పష్టంగా కనిపించని కదలికతో ఆసనమునుండి లేచాడు సమర్థ రాముడు. ఆశ్చర్యంగా చూస్తూ తామూ నిలుచున్నారు మిగిలినవారు.

కనులుతెరిచి, చేతులను విడదీసి నమస్కార భంగిమలో, ప్రశాంతంగా గుండెలోతులలోకి చూస్తున్నట్లు సమర్థ రాముడినే చూస్తున్నాడు ఆ నడివయస్కుడు. చిన్నకొడుకును తల్లి లాగా, మారుతిని శ్రీరాముడిలా ఆప్యాయంగా, మురిపెంగా ఆతడి కనులలోకి చూస్తున్నాడు సమర్థరాముడు. అంతవరకూ కృష్ణరాయలు, అక్కన్నా మాదన్నలు చూసి ఎరుగని సంఘటన జరిగింది. అందరినీ సంభ్రమాశ్చర్యాలకు గురిచేసింది. ఒక్క ఛత్రపతి శివాజీకే దక్కిన బహుమతి దక్కింది ఆ అతిథికి. దృఢములైన తన రెండు బాహువులను విశాలంగా సాచాడు సమర్థరాముడు. చెక్కిళ్ళమీదుగా మెరుస్తున్న చెమ్మతో, నమస్కరిస్తూనే కొద్దిగా వంగి ఆ బాహువులమధ్య ఒదిగిపోయాడు ఆ నడివయస్కుడు, సీతమ్మను చూసివచ్చిన హనుమ శ్రీరాముని కౌగిలిలో ఒదిగినట్లు. పాఠకుడా! ప్రవర సరిగా విన్నావో లేదో, నా స్మృతుల మైమరపులో నేను చెప్పానో లేదో, ఆత్రేయస-అర్చనానస-శావాశ్వ- త్రయార్షేయ ప్రవరాన్విత ఆత్రేయ గోత్ర పావనుడు, శుక్ల యజుశ్శాఖాధ్యాయి, ఆతడు కంచర్ల గోపన్న!

## -13-

తన బాహువులలో ఒదిగి, అక్కడనుండి పాదాలమీదకు జారి, అక్కడ తన నుదురును తాకించి విశ్రాంతిగా ఉన్న గోపన్నను పైకి లేవనెత్తాడు సమర్థరాముడు. గోపన్న మెడమీద, ముంజేతులకు ధరించిన బంగారపు కంకణాల అంచులక్రింద నల్లని కదుములు. పన్నెండు సంవత్సరాల దీర్ఘకాలం యినుప గొలుసులు రుద్దుకుని కాచిన కాయలవి. హెచ్చిన పున్నెపు గుర్తులో, తొలిగిన ఒక్కొక్క అపరాధపు గుర్తులో, దండచేతులమీద, ముంజేతులమీద కొరడా దెబ్బల గాయాలు. కొన్ని యింకా పచ్చి మాననట్లుగా, ఎర్రనెర్రగా ఉన్నాయి, చిరునవ్వుతో విచ్చిన శ్రీరాముని పెదవుల్లా. సమర్థ రాముని కనులు చెమరించినట్లు పల్చని తడి మెరిసింది చెక్కిళ్ళమీద. కరుణతో చలించి పోయారు అనుకున్నారు అక్కన్నా, మాదన్నలు. ఒక పాత సంఘటన గుర్తుకొచ్చింది కృష్ణరాయలకు.

ఒకసారి శిష్యసమేతంగా ఒక గ్రామం గుండా వెళ్తున్నాడు సమర్థరాముడు. భోజనంవేళ దాటిపోయినా యింకా వెళ్ళాల్సిన దూరం ఉన్నది. ఎండకు ఒక చెట్టుక్రింద ఆయనను కూర్చుండబెట్టి, ఆయన శిష్యులు ప్రక్కన ఉన్న చేలోకి వెళ్ళి, కావలివాడు కానీ, యజమానిగానీ ఉన్నారేమో, కొన్ని కంకులు యిమ్మని అడుగుదామనుకున్నారు. ఎవరూ కనబడలేదు. నాలుగంటే నాలుగు కంకులు కోసుకొచ్చారు. ఆయనకు గింజలు వలిచి పెట్టారు.

యింతలో ఆ చేను యజమాని వచ్చి, ఆయనను చూశాడు. తన పంటచేనుమీద పడి మొక్కజొన్నపొత్తులు కోసుకున్నాడని, ఆయనను పశువునుబాదినట్టు బాదడం మొదలెట్టాడు. ఆయన వారించడంతో శిష్యులు అడ్డుకోడానికి కూడా లేకుండాపోయింది. ఆయన వెళుతున్నది ఛత్రపతి శివాజీ ఆహ్వానం మేరకు, రాజధానికి. మరునాడు ఆయన ఒంటినిండా గాయాలను చూసి, ఏం జరిగిందో తెలుసుకుందామనుకున్నాడు ఛత్రపతి. ఆయన నవ్వి ఊరుకున్నాడు. శిష్యుల ద్వారా జరిగింది పసిగట్టాడు ఛత్రపతి. ఆ రైతును మరునాడు రాజసభకు బంధించి తీసుకొచ్చారు ఛత్రపతి సైనికులు. అతడిని శిక్షించవద్దు అని ఆజ్ఞాపించి, పైపెచ్చు తన సహనశక్తిని పరీక్షించుకునే అవకాశం కల్పించాడు అని ఆరైతుకు ఛత్రపతి చేతులమీదుగా సత్కారం చేయించాడు సమర్ధరాముడు! తన శరీరానికి తగిలిన దెబ్బలకు చలించలేదు, గోపన్న శరీరం మీది గాయాలకు చలించిపోతున్నాడు! మహానుభావులకు తమ దేహబాధలు ఎంతటి తీవ్రమైనవి అయినా స్వల్పంగా కనిపిస్తాయి. యితరులకు ఏ చిన్ని బాధ కలిగినా కరుణతో ద్రవించిపోతారు అనుకున్నాడు కృష్ణరాయలు.

పసిబిడ్డ శరీరాన్ని ప్రేమగా, సున్నితంగా నిమిరినట్లు ఆ కదుములమీద ఆయన చేతులతో మృదువుగా నిమురుతుంటే, ఆ కన్నుల చెమ్మ రామసేవా పతకాలను అబ్బురంగా చూస్తున్న ఆనందపు చెమ్మ అనిపించింది గోపన్నకు. మరుక్షణమే ఆ గాయాల బాధ మటుమాయమైన అనుభూతి కలిగింది, చల్లని చందనము పూసుకున్న హాయి కలిగింది. గోపన్నకు కూర్చుండమని సంజ్ఞ చేశాడు సమర్ధ రాముడు తనూ కూర్చుంటూ. అక్కడున్నవారి ఉచ్ఛ్వాస నిశ్వాసాలు కూడా వినిపించేంత ప్రశాంతమైన నిశ్శబ్దం అలుముకుని ఉన్నది ఆ విశాలమైన గదిలో. బయట మామిడి చెట్లక్రింద సిపాయీలు మాట్లాడుకుంటున్న ధ్వనులు, పక్షుల కూతలు, దూరంగా గోధూళివేళకు యిళ్ళకు మరలుతున్న పశువుల మెడలకున్న ఘంటల ధ్వనులు, కాపరుల అదలింపులు వినిపిస్తున్నాయి. ఉండీ ఉండీ సన్నసన్నగా గుఱ్ఱాల సకిలింపులు జోడు పలుకుతున్నాయి.

సుఖాసనంలో కనులుమూసుకుని సమర్ధరామదాసు తనలోపల ఏదో చూస్తున్నట్లున్నారు. మేనమామల కుశల ప్రశ్నలకు అన్యమనస్కంగా సమాధానాలు యిస్తున్నాడు గోపన్న.

అంతకు పక్షం రోజులక్రితమే తానీషా ఖైదునుండి సమస్త రాజలాంఛనాలతో విడుదల అయినాడు గోపన్న. వంద ఉత్తమజాతి అరేబియా గుఱ్ఱాలమీద రౌతులు ఊరేగింపుగా వెన్నంటి వచ్చారు. తానీషా ఆంతరంగికులకు ఉపయోగించే బంగారు నగిషీలు దిద్దిన వెండి పల్లకీలో గోల్కొండనుండి పాలవంచవరకూ సగౌరవంగా ఆయనను తోడ్కొని పోయారు తానీషా కొలువులోని బానిసలు. దారిపొడవునా, ఊరూరా సాగిలబడేవారు, మంగళహారతులిచ్చేవారు, వైకుంఠానికి వినిపించేట్లు రామునికీ, రామదాసుకూ జయజయధ్వానాలు పలికేవారు బారులుతీరారు.

తానీషా స్వయంగా వీడుకోలు చెప్పిన ఫతే దర్వాజానుండి పాలవంచవరకూ దారికిరువైపులా మానవహారం ఏర్పడింది. వెనుక మరొక పల్లకీలో తానీషా భద్రాచలరామునికి సమర్పించిన బంగారు జరీ చేసిన చీనాంబరాలు బంగారు పళ్ళెరంలో ఉంచబడ్డాయి. ఆఫ్రికా ఏనుగుల దంతాలతో చేసినచిన్ని పేటిక కూడా ఉంచారు ఆ పల్లకీలో. ఆ పేటికలో రామ లక్ష్మణులు తానీషావారికి చెల్లించిన వాటిలోనుండి కొన్ని మాడలు, సర్కారువారికి రామదాసు చెల్లించవలసిన పైకం ముట్టినట్లుగా రశీదు భద్రపరచబడ్డాయి.

పల్లకీలో ఊరేగుతున్న రామదాసు కంటివెంట బాష్పప్రవాహం ఆగలేదు, జనప్రవాహంలాగే. ధర్మపత్నిని పల్లకీ ఎక్కించుకుని భద్రాద్రి రాముడిని పుష్కరకాలంతరువాత పునర్దర్శనం చేసుకున్నపుడూ ఆగలేదు, ఇంకా ఉధృతమైంది. ఈ పక్షంరోజులుగా ఖైదులో ఉన్న పన్నెండు సంవత్సరాలు విలపించినదానికన్నా ఎక్కువ విలపించాడు ఆయన. గుండె బీటవారి, కన్నీరు యింకిపోయింది. యిప్పటి వేదన యింకా దుర్భరంగా ఉన్నది ఆయనకు. సమర్ధరాముని ఆగమనవార్త తెలిసి, ఆయన దర్శనంకోసం వచ్చాడు కానీ మనసులో ఆ దుఃఖకారణము నలిపివేస్తూనే ఉన్నది.

# -14-

గతాన్ని, ప్రస్తుతాన్ని, భావిని తురిమి, తురిమి, తరచి చూస్తునట్లు నిశ్చలంగా కనులుమూసుకుని అంతర్వీక్షకులైన సమర్ధ రాముడు నెమ్మదిగా కనులు తెరిచాడు. పరిచారికలు సాయంకాల పానీయాలు అందించారు. సేవించిన అనంతరం అక్కన్న మాదన్నలు సమర్ధునివద్ద శెలవు తీసుకుని, మేనల్లుడిని పరామర్శించి, ఎట్టకేలకు బంధవిముక్తుడైనందుకు తమసంతోషాన్ని ప్రకటించి తిరుగు పయనమయ్యారు. కృష్ణరాయలు, గోపన్నలు మాత్రమే ఉన్న సమయములో, చాలా నెమ్మదిగా హెచ్చరించాడు సమర్ధరాముడు.

'మాదోబా! మల్లప్ప మనుషులు, ఇబ్రహీం అనుచరులు నీ అంగరక్షకులలో చేరిపోయారు. అనుక్షణము మీ అన్నదమ్ముల కదలికలు కనిపెట్టి, మీ శత్రువులకు చేరవేస్తున్నారు. ఛత్రపతి గోల్కొండలో కాలుబెట్టడం మీకింకా శత్రువృద్ధికి కారణమవుతుంది. జాగ్రత్త వహించండి' అన్నాడు.

'మీ అండన ఉన్నాము. మాకేం భయం?' చిరునవ్వుతో నమస్కరిస్తూ పలికి, ఆభరణాల, గలగలలు, కరవాలపు గరగరలు ధ్వనిస్తూ కదిలాడు మాదన్న. మదగజంలా, స్థూలకాయాన్ని బరువుగా కదిలిస్తూ దర్బారు హాలును, విశాలమైన నడవాను దాటాడు. చలువరాళ్ళు పరిచిన మెట్లనుదిగి, వెనుదిరిగి మరొకసారి వినయంగా నమస్కరించి, మేనాను ఎక్కి కూర్చున్నాడు. అన్నను అనుసరించాడు అక్కన్న. వెనుకా ముందూ అంగరక్షకులు గుర్రాలమీద కదిలారు. పల్లకీ కదిలి వెళ్ళిపోయింది.

బోయీల అహోం అహోం ధ్వనులు కోట ప్రాకారాన్నిదాటి, వీధినంతటినీ ఆక్రమించుకున్న రావిచెట్టు క్రిందుగా, దూరంగా , చెవులకు అందకుండా పోయేంతవరకూ గంభీరంగా దృక్కులు సారించి చూస్తున్న సమర్ధరాముడు ' గోపన్నా! ఈ రాత్రి మీ సంకీర్తన వినాలనుకుంటున్నాడు రఘువీరుడు' అన్నాడు చిరునవ్వులు చిందిస్తూ. సాయంసంధ్యావిధుల అనంతరం సంకీర్తన, సత్సంగం, పవళింపుసేవలతో రాముడిని నిద్రబుచ్చి తాము విశ్రాంతి తీసుకుంటారు ఆయన. 'మహాప్రసాదం' అన్నాడు గోపన్న ఆనందంగా. తను ఆ రాత్రికి ముక్తివరంలోనే ఆగిపోతున్నట్లు ధరగిరిపురంలో ఎదురుజూస్తున్న తల్లిదండ్రులకు, భార్యకు వెంటనే వర్తమానంపంపాడు ఒక అనుచరునితో.

శిష్యులు అనుసరిస్తుండగా మున్నేరుకు స్నానానికి వెళ్ళి, స్నాన, సంధ్యావందన, జపవిధులు తీర్చుకుని సమర్ధరాముడు వచ్చేసరికి సీతా లక్ష్మణ హనుమత్సమేత శ్రీరామ మూర్తిని దివ్యంగా అలంకరించి సిద్ధంగా ఉన్నారు యిద్దరు శిష్యులు. అప్పటికి చీకట్లు పూర్తిగా కమ్ముకున్నాయి.

కోటబురుజులమీద చమురుదీపాలు, మధ్య మధ్య కాగడాలు కృష్ణరాయల కోటలో రాత్రిని పగలుగా మార్చేశాయి. సువిశాలమైన మామిడితోపునుండి, పూలతోట నుండి తీయని సువాసనలను మోసుకొస్తున్నాయి మున్నేటి చల్లనిగాలులు. మిన్నేటిశయనుడు తమ్ముడితో, అమ్మడితో, కరమున విల్లమ్ములతో, అంజలిస్తున్న హనుమతో అయోధ్యవిభుడిగా వేదికమీద కొలువైనాడు. కల్యాణస్వామి కంజర అందుకున్నాడు. ఉద్ధవుడు మద్దెల ముద్దుగా వాయించాడు. సమర్ధరాముడు చిటి తాళాల రసధ్వని చిలికించాడు. కృష్ణరాయవనం వైకుంఠబృందావనం అయ్యింది. పన్నీటిజల్లువలె రామదాసు గానామృతం ప్రవహించడం మొదలైంది. కుతూహలంతో తిలకించడానికి పొడిచిన చంద్రుడు పోటీగా వెన్నెల సుధలను కురిపిస్తున్నాడు. భద్రాచల రామదాసు గానసుధలను కురిపిస్తున్నాడు. సమర్ధరాముడు, శిష్యులు, కృష్ణరాయలు, ఆయన యిల్లాలు, దాసీసమూహం, కోటలోని అంగరక్షకులు, పరివారము, బురుజులమీదికెక్కి పహారా ప్రారంభించిన కావలివాళ్ళు, ఆహ్వానింపబడిన గ్రామముఖ్యులు అందరూ ఆదమరచి ఆలకిస్తున్నారు. అక్కడిశరీరాలన్నీ ఒక్కమనసుతో, ఒక్క ఆత్మతో, ఒక్క చిత్తంతో రామాయత్తమయ్యాయి.

'దినమొక ఏడుగ ఘనముగ గడిపెద తనయునిమీద దయలే దయ్యయ్యో! యేమిరా రామా! నావల్ల నేరమేమిరా రామా!' అని నిష్ఠూరంతో మొదలు పెట్టాడు గోపన్న. 'హరిహర రామ నన్నరమరచూడకు నిరతము నీ నామ స్మరణ ఏమరను' అని ప్రతినజేశాడు. 'రామజోగి మందు కొనరే, పామరులారా! అని ప్రబోధించాడు. 'గరుడగమన రారా నను నీ కరుణ నేలుకోరా' అని బ్రతిమిలాడాడు. 'కోసలేంద్రాయ మందహాస దాస పోషణాయ వాసవాదివినుత సర్వరాయ మంగళం!' అని ముగించిన కొంతసేపటివరకూ ఆనందపారవశ్యంతో మూసిన వందల నేత్రాలు తెరిపిళ్ళు పడలేదు. భద్రాచల రామదాసు అశ్రుపాతముతో స్తంభించిపోయాడు. సమర్ధరాముడు సమాధిస్థితిలోకి వెళ్ళిపోయాడు. కోటయావత్తూ వెన్నెలకుంచెతో చిత్రించిన చిత్తరువయ్యింది.

.

(కొనసాగింపు వచ్చే సంచికలో..)

COMMENTS